''అంకుల్.. ఎవరికైనా చెప్పాలంటే ఫోన్ చేస్తాను..'' ఎలాగో గొంతు పెగుల్చుకున్నాను.

''లక్ష్మిని ఇంటికి తెచ్చేశాం! ఇంకేం కంగారు లేదు. పనివాళ్లున్నారుగా.. అయినా ఇంక చేయడానికేముంది? శవంగా తనూ, జీవచ్ఛవంగా నేనూ.. పిల్లలొచ్చేవరకు ఎదురుచూడటమే! ఇప్పటికే నిన్ను చాలా ఇబ్బంది పెట్టాను.. ఇంకా ఉండమనడం భావ్యం కాదు'' అంటూ చేతులు జోడించబోయారు. చప్పున ఆయన చేతులు పట్టుకున్నాను.

తప్పనిసరై నిశ్శబ్దంగా బైటికి నడిచాను.

ఇంటికెలా చేరానో, ఏం తిన్నానో, కలలో జరిగినట్టుగా అనిపించింది. మర్నాడు ఎనిమిదింటికి నిద్రలేచాను.

''ఇవాళ కూడా రానట్టేగా?'' అసహనంగా చూసింది రేవతి..

''రాత్రి చాలా లేటైనట్టుంది..'' తల భారంగా అనిపిస్తోంది.

''గూర్ఖావాడు, మీరు కలిసే వచ్చారు..'' రేవతి మాటల్లో విసుగు, బాధ, భయం..

''ఎందుకీ అర్థంపర్థం లేని పనులు.. మీ స్నేహితుడేమో అక్కడ్నుంచి ఫోన్‌చేసి ఆర్డర్ వేయడం.. తగుదునమ్మా అని మీరు పరిగెత్తడం.. ఇంతాచేస్తే మీఫ్రెండ్ గానీ, వాళ్ల నాన్నగారు గానీ ఆస్తిలో వాటా ఇస్తారా? సంపాదన కోసం ఎగబడి పోతున్నారుగా.. కన్నవాళ్లు ఇక్కడ ఉన్నారో చచ్చారో ఎవరికీ పట్టదు. డబ్బులు పంపిస్తే చాలా? నిలబడి చేసేవాళ్లు కావాలి? పిల్లల్ని పంపించి పెద్దవాళ్లు, ఈ పెద్దవాళ్లని వదిలేసి ఆ పిల్లలు ఏం బావుకుంటున్నారో తెలియడం లేదు. అమ్మ అన్న మాట నేర్పుతున్నారో లేదో తెలీదు గానీ.. అమెరికా, ఆస్ట్రేలియా అన్న మాటలు మాత్రం బాగా పలికిస్తున్నారు. అయినా మీరు సాయం చేస్తున్నారో, చాకిరీ చేస్తున్నారో తెలుసుకోలేని పిచ్చిలో ఉన్నారు. అంతా నా ఖర్మ!'' రేవతి మాటలు ఆగడం లేదు.

సరిగ్గా అప్పుడే మోహన్ దగ్గరనించి ఫోన్. చటుక్కున నా చేతిలో ఫోన్ లాక్కుని స్విచాఫ్ చేసింది.

తన ఆవేదన తెలుసు. నచ్చచెప్పే ప్రయత్నం చేశాను.

''పెద్దాయన ఒక్కరే ఉన్నారు. కనీసం మోహన్ వచ్చేవరకు.. ప్లీజ్ రేవతీ! అర్థం చేసుకో! నిన్ను ఆఫీసు దగ్గర దిగబెట్టి..'' నా మాటలు పూర్తికాకుండానే రేవతి అందుకుంది..

''అక్కర్లేదు.. నా చావు నేను చస్తా! మీరు శవజాగరణ చేసుకోండి''.. విసురుగా వెళ్లిపోయింది.

రెండు రోజుల తర్వాతగానీ మోహన్, సుధ రాలేకపోయారు. మోహన్ భార్య గర్భవతి, రాలేదు. సుధ, ఆమె భర్త వచ్చారు, పిల్లలు రాలేదు. సుందర్రావుగారి తరుపు బంధువులు పెద్దగా రాలేదు. చాలామంది విదేశాలలో ఉన్నారని ఇంటి పనివాళ్లు చెప్పారు. సిటీలో ఉన్నవాళ్లు కూడా ఎక్కువగా రావడం చూడలేదన్నారు.

మొబైల్ ద్వారా మాత్రమే ఎక్కువగా మాట్లాడేవారని చెప్పారు.

'ఆన్‌లైన్' సదుపాయంతో పెద్దగా హడావుడి లేకుండానే లక్ష్మి ఆంటీ అంత్యక్రియల ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీడియో రికార్డింగ్ కూడా జరుగుతోంది.

భుజమ్మీద చెయ్యేసే వాళ్లు లేరు. పక్కన కూచుని పలకరించే వాళ్లు లేరు. దగ్గరకి తీసుకుని ధైర్యం చెప్పేవారు లేరు. ఒకమాట ఇటు, ఒకమాట మొబైల్‌లో.. అక్కడున్న పదిమంది చేతుల్లో ఇరవై కనిపిస్తున్నాయి. ఒకరిద్దరు ఫ్రీజర్ పక్కన నిలబడి సెల్ఫీలు దిగుతున్నారు. మళ్లీ వస్తామో!? రామో!? అనిటు! నిమిషానికో ఫోన్ మోగుతోంది. జీవంలేని మొబైల్.. ప్రాణంగా తయారైంది.

ప్రాణం పోయిన మనిషిని ఎప్పుడు తీసుకెళ్తారా!? అని అసహనంగా ఎదురుచూస్తున్నారు. ఏడవాలో, నవ్వాలో అర్థం కావడంలేదు.

జరిగే తతంగమంతా ప్రత్యక్షప్రసారంలాగా రాని వాళ్ల కోసం ఫోను ద్వారా చూపిస్తున్నారు ఇంకెవరో. పలకరింపులు, పరామర్శలు, ఓదార్పులు, నిట్టూర్పులు, ఏడవడాలు అన్నీ మొబైల్ ద్వారా జరిగిపోతున్నాయి. సుందర్రావుగారు నిర్లిప్తంగా ఉన్నారు.

''పిన్ని మొహం సరిగ్గా కనిపించడం లేదు.. కాస్త దగ్గరగా చూపించు..'' ఎవరి ఫోన్‌లోంచో అవతలివైపు గొంతు స్పష్టంగా వినిపిస్తోంది.

''నా ఫోన్లో డాటా అయిపోయింది. ఒక్క నిమిషం.. రీచార్జి చేస్తున్నాను'' ఇవతలి వారి సమాధానం.

''ఎందుకురా కంగారు! ఫోన్‌లో సరిగా కనిపించదనే వీడియో తీయిస్తున్నాడు మోహన్. ఆన్‌లైన్‌లో లింక్ పంపిస్తానన్నాడు. డాటా ఎందుకు దండగ'' అన్నాడో మధ్య వయస్కుడు.

మార్కెట్లో ఉన్న అధునాతన స్మార్ట్‌ఫోన్లు, ఇప్పుడున్న 'జీ' నుంచి.. భవిష్యత్తులో రాబోయే 'జీ' లు. ఉన్న చోటునుంచి కదలకుండా జీవితాలని సౌకర్యవంతం చేస్తున్న ఆన్‌లైన్ ఉపకరణాల గురించి చర్చ మొదలైంది.

మోహన్ తన భార్యకి, సుధ తన పిల్లలకి మొబైల్ ద్వారా ఇక్కడి దృశ్యాలని చూపిస్తూ, రన్నింగ్ కామెంటరీ చెబుతున్నాడు.

నా చేతిలో ఉన్న మొబైల్ని చూస్తే భయమేస్తోంది.

'అమ్మగారి మంచితనం' చెప్పుకొంటూ.. పనివాళ్లు అప్పుడప్పుడూ గొల్లుమంటున్నారు.

దహన సంస్కారాలు పూర్తయ్యాయి. వచ్చిన అతిథులు వెళ్లిపోయారు. భరించలేనంత నిశ్శబ్దం!

అంతకుముందే మోహన్‌తో చెప్పాల్సింది చెప్పి, తనిచ్చిన సొమ్ములో మిగిలింది ట్రాన్స్‌ఫర్ చేసేసి భారంగా అడుగులేశాను.

అప్పటికే వారంరోజులు సెలవులుగా కరిగిపోయాయి. ఇంటికెళ్లగానే పూర్తిస్థాయిలో శుద్ధి చేసింది రేవతి.. నన్నూ, నా మొబైల్ని కూడా.

మర్నాడు ఆఫీసులోకి అడుగుపెట్టగానే బాస్ కూడా వార్నింగ్ లెటర్ ఇచ్చాడు.

మరో వారం తర్వాత అమెరికా వెళ్లబోతూ విమానాశ్రయం నుండి ఫోన్ చేశాడు మోహన్. సుధ ఆమె భర్త రెండురోజుల ముందే పిల్లల కోసం వెళ్లిపోయారట. భార్యని డెలివరి కోసం చేర్పించడంతో, కొడుకుగా తల్లికి చేయాల్సిన మిగతా కార్యక్రమాల కోసం ఎవరినో ఏడాదిపాటు 'గుత్తగా' మాట్లాడి కుదిర్చానని చెప్పాడు.

''మరి నాన్నగారు..'' ఇంకేం అడగాలో అర్థం కాలేదు నాకు.

''అంత పెద్దింట్లో ఆయనొక్కరే ఉండటం కష్టమని.. వెళ్లేముందే వృద్ధాశ్రమంలో చేర్పించాను. ఆన్‌లైన్ ద్వారా సులువుగానే పనైపోయింది. ఇల్లు అద్దెకివ్వడం కోసం కూడా ఆన్‌లైన్‌లోనే వివరాలిచ్చాను రా. ఇండియా ఎప్పుడొస్తానో తెలీదు.. సమయానికి నువ్వు చేసిన సాయానికి చాలా థాంక్స్ రా.. మళ్లీ ఆన్‌లైన్‌లో కలుద్దాం.. బై!'' కాల్ ఆగిపోయింది.

అంటే.. ఇంక తండ్రితో అవసరం లేదన్నమాట!

అంకుల్ మొహం గుర్తొచ్చి మనసు చివుక్కుమంది.. తట్టుకోలేకపోయాను.

మానవ జీవితాలని, సంబంధాలని 'ఆన్‌లైన్' శాసిస్తోందా? మంచితనం, మానవత్వం అసహజాలా?

భవిష్యత్తులో మానవతా విలువలు, సంబంధ బాంధవ్యాలు, అనురాగాలు, ఆప్యాయతలు వంటి పదాల అర్థాల కోసం అంతర్జాలంలో గాలించాలేమో?

చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ వైబ్రేషన్‌లో కదులుతోంది, పాముపిల్లలా.

'రవీంద్ర కాలింగ్'.. సహోద్యోగి అతను. నాకు జూనియర్. ప్రసవంలో అతని భార్యకి కడుపులో బిడ్డ అడ్డం తిరగడంతో ఆపరేషన్ చేస్తున్నారట.. సాయంగా రమ్మంటున్నాడు.. ఏం చేయను? తోచడం లేదు.

ఎందుకో గానీ, చిన్నప్పుడు విన్న ఒక కథ మాత్రం గుర్తొచ్చింది. ఒక సాధువు నీటిలో కొట్టుకుపోతున్న ఒక తేలుని చూసి, సాయం చేద్దామని ఎన్నిసార్లు బైటికి తీసి కాపాడినా.. అన్నిసార్లూ సాధువుని కుట్టి మళ్లీ నీళ్లలోకే పడుతోందిట ఆ తేలు. ఆ బాధ భరిస్తూనే తన ప్రయత్నం ఆపకుండా మళ్లీమళ్లీ దాన్ని బయటకు తీస్తూనే ఉన్నాడాయన. చుట్టూ చేరిన జనాలు వినోదంలా చూస్తూ నవ్వుతుంటే, ఆ సాధువు కూడా నవ్వి.. 'కుట్టడం దాని సహజగుణం. సమయానికి సాయం చేసి కాపాడటం మనిషి సహజగుణం. ఒంట్లో విషాన్ని నింపుకొన్న తేలే దాని గుణాన్ని వదులుకోనప్పుడు.. మనిషిగా నేను, నా సహజగుణాన్ని ఎలా వదులుకుంటాను' అంటూ జనాల మాటలు పట్టించుకోకుండా.. మళ్లీ తేలుని తీసి దూరంగా విడిచిపెట్టి ముందుకెళ్లిపోయాడు.

ఈ సన్నివేశం జ్ఞప్తికి రాగానే మనసు తేలికపడింది. ఆ సమయంలో రేవతి తిట్లు, బాస్ హెచ్చరికలు, తోటి వారి గుసగుసలు మరేమీ గుర్తుకురాలేదు.

తక్షణం నా మిత్రుడి కోసం బయలుదేరాను.

## ఆకెళ్ల సూర్యనారాయణ మూర్తి



**ఏదైనా** విషయం లేదా సంఘటన పట్ల మనసు స్పందించినప్పుడు.. కథ గానీ కవిత గానీ రూపుదిద్దుకుంటుంది. అలా రూపుదిద్దుకున్న కథే.. సహజం! రచయిత ఆకెళ్ల సూర్యనారాయణ మూర్తి. ఎం.కామ్ చేశారు. సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే సొసైటీలో ఆఫీస్ సూపరింటెండెంట్ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి.. 2023లో విరమణ తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర శ్రీ సత్యసాయి సేవాసంస్థలలో రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా ఉన్నారు. సాయి సంస్థల కోసం రచనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తున్నారు. కథలు, కవితలు, నాటికలు, ఇతర రచనలు చేయడాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు. పత్రికలతోపాటు రేడియో, దూరదర్శన్, ఇతర ప్రైవేట్ చానెల్స్‌లో డైలీ సీరియల్స్ కోసం మాటలు రాశారు. 2015లో రాజమండ్రిలో నిర్వహించిన నంది అవార్డు నాటకాల పోటీలలో.. ఈయన రాసిన 'పడగనీడ' నాటకం ప్రదర్శనకు నోచుకుంది. స్టేజ్, రేడియో, టీవీలలో నటన, వ్యాఖ్యానం చేశారు. మా ఊరు, ఒక్క క్షణం, అలౌకిక లాంటి సీరియల్స్ ప్రేక్షకుల మన్ననలు పొందాయి.